చేనేత కార్మికులు చైతన్యవంతులు కావాలి



ఈతముక్కలలో మాట్లాడుతున్న నాగేశ్వరరావు



చీమకుర్తిలో ర్యాలీ నిర్వహిస్తున్న చేనేత కార్మికులు, పద్మశాలీయులు

● ఘనంగా జాతీయ చేనేత దినోత్సవం

ఈతముక్కల (కొత్తపట్నం): చేనేత కార్మికులు విద్య, వైద్య, ఆర్థిక, రాజకీయ రంగాల్లో చైతన్యవంతులు కావాలని గ్రామ చేనేత సంఘ అధ్యక్షుడు గోరుపిన నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈతముక్కల కామన్ ఫెసిలిటీస్ సెంటర్‌లో సోమవారం చేనేత కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేనేత కార్మికులకు ఎన్నో సమస్యలున్నాయని, వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా నేతన్న నేస్తం పథకంలో రూ.24 వేలు ఇవ్వడం అభినందనీయమన్నారు. మనమంతా ఐక్యంగా ఉండి సమస్యలపై పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. బండారు వెంకటసుబ్బారావు మాట్లాడుతూ చేనేత వినియోగదారుల సంఖ్య పెంచాల్సిన అవసరం అందరిపై ఉందన్నారు. ప్రభుత్వం చేనేత కార్మికులకు అనేక సదుపాయాలు కల్పిస్తోందని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వెల్ఫేర్ అసిస్టెంట్ శ్రీనివాస్‌ను చేనేత కార్మికులు శాలువా, పూలమాలతో సన్మానించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నితిన్, బండారు ఏడుకొండలు, సత్యబాబు, రామ్మోహన్‌రావు, మునగాల రామలింగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చేనేత కార్మికులకు పింఛన్లు ఇవ్వాలి

చీమకుర్తి: 50 సంవత్సరాలు దాటిన చేనేత కార్మికులకు పింఛన్లు మంజూరు చేయాలని, నూలుపై జీఎస్టీ రద్దు చేయాలని చేనేత కార్మికులు, పద్మశాలీయులు డిమాండ్ చేశారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా సోమవారం చీమకుర్తిలోని నెహ్రూనగర్ నుంచి చేనేత సొసైటీ వరకు పద్మశాలీయుల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి ప్రగడ కోటయ్యకు నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు సోమా శేషాద్రి, గోపురపు చంద్ర, అవ్వారు ఆదినారాయణ, సోమా యానాదిశెట్టి పాల్గొన్నారు.

నేటి నుంచి నామినేషన్ల ప్రక్రియ

కొత్తపట్నం : మండలంలోని రెండు పంచాయతీల ఉపఎన్నికలకు మంగళవారం నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమవుతుందని ఎంపీడీవో పి.సుజాత తెలిపారు. మండలంలోని కొత్తపట్నం గ్రామ పంచాయతీ పరిధిలో 6వ వార్డు, అల్లూరు గ్రామ పంచాయతీ పరిధిలో 4వ వార్డు సభ్యులు చనిపోయినందున ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 8 నుంచి 10వ తేదీ వరకు ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్ల ప్రక్రియ జరుగుతుందన్నారు. 11న స్క్రూటినీ, 12న నామినేషన్ల తిరస్కరణ, ఆర్డీవోకు అప్పీల్ చేసుకునే అవకాశం, 13న అప్పిలేట్ అథారిటీ అప్పీల్ని విడుదల చేయడం, 14న నామినేషన్ల విత్ డ్రా, 19న ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పోలింగ్, అనంతరం కౌంటింగ్ జరుగుతాయని వివరించారు. కౌంటింగ్ అనంతరం గెలిచిన అభ్యర్థిని ప్రకటించడం జరుగుతుందన్నారు. ఉప సర్పంచ్ ఎన్నిక జరగాల్సి ఉంటే వార్డు మెంబర్లంతా ఒక చోట చేరి అదే రోజు ఎన్నిక చేసుకోవాల్సి ఉంటుందని ఎంపీడీవో తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకరమైన ఆహారం



ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ సిబ్బంది

చీమకుర్తి: ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటలు సాగు చేస్తే ఆరోగ్యకరమైన ఆహారాన్ని పొందవచ్చని ప్రకృతి వ్యవసాయం డీపీఎం సుభాషిణి తెలిపారు. సోమవారం మండలంలోని ఇలపావులూరులో స్థానిక రైతు రామాంజనేయులు అరెకరా పొలంలో ప్రకృతి వ్యవసాయం ద్వారా కంది, పత్తి, అంతర పంటలుగా టమోటా, మిరప, వంగ, అలసంద, సరిహద్దు పంటలుగా జొన్న, సజ్జ, ఆముదం, ఎరపంటలుగా బంతి, సన్‌ఫ్లవర్, మరో 20 సెంట్లలో ఏటీఎం పంటల సాగును పరిశీలించారు. ఇలాంటి పంటల విధానాన్ని రైతులు అలవాటు చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రాధ, సాయికృష్ణ, శ్రీకాంత్, స్థానికులు పాల్గొన్నారు.

మణిపూర్ దోషులను కఠినంగా శిక్షించాలి



చీమకుర్తిలో నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజాసంఘాలు, క్రైస్తవ సంఘాల సభ్యులు

చీమకుర్తి: మణిపూర్‌లోని ఆదివాసీ క్రైస్తవులపై దాడులు చేసి అత్యాచారాలకు పాల్పడుతున్న దోషులను వెంటనే శిక్షించాలని ప్రజాసంఘాల ప్రతినిధులు, ఐక్య క్రైస్తవ సంఘాల సభ్యులు డిమాండ్ చేశారు. సోమవారం చీమకుర్తిలోని ఎస్‌ఎస్సీ కాలనీ నుంచి బస్టాండ్ వరకు ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ వద్ద పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేశారు. ఆదివాసీ క్రైస్తవులపై గత కొన్ని నెలలుగా దాడులతో మారణ హోమం సృష్టిస్తుంటే ప్రధాని నరేంద్రమోదీ, హోం మంత్రి అమిత్‌షా, మణిపూర్ ముఖ్యమంత్రి నోరు విప్పకపోవడం శోచనీయమన్నారు. ఇప్పటికే మణిపూర్‌లో 420 చర్చిలను ధ్వంసం చేశారని, అనేక మంది మహిళలపై అత్యాచారాలు చేసి హత్య చేసినా ఆయా ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం మతోన్మాద తీవ్రతకు నిదర్శనమని అన్నారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో కేవీపీఎస్ సంఘాల సభ్యులు గంటినపల్లి పోతురాజు, రాంబాబు, రాజు, పురుషోత్తం, స్థానికులు పాల్గొన్నారు.

నిబంధనలకు లోబడి ఎన్నికల ఖర్చు ఉండాలి

● డీపీవో నారాయణరెడ్డి

ఒంగోలు అర్బన్: పంచాయతీ ఉప ఎన్నికల్లో అభ్యర్థుల ఎన్నికల ఖర్చు నిబంధనలకు లోబడి ఉండాలని, ఆ దిశగా తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి, అదనపు జిల్లా ఎన్నికల అధికారి జీవీ నారాయణరెడ్డి మండల అధికారులకు సూచించారు. జిల్లాలో స్థానిక సంస్థల్లో ఏర్పడిన ఖాళీలను భర్తీ చేసేందుకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. సర్పంచ్ (2), వార్డు సభ్యులు (63) ఎన్నికలు నిర్వహించేందుకు షెడ్యూలు ప్రకటించారన్నారు. ఈ నేపథ్యంలో ఆయా మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, విస్తరణాధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సోమవారం వీడియో సమావేశం నిర్వహించి మాట్లాడారు. 2011 జనాభా లెక్కల ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ఎన్నికల ఖర్చు నిబంధనల గురించి తెలియజేశారు. 10 వేల జనాభా కంటే ఎక్కువ ఉన్న పంచాయతీల్లో సర్పంచ్ అభ్యర్థి రూ.2.5 లక్షలు, వార్డు సభ్యులు రూ.50 వేలు ఎన్నికల ఖర్చు ఉండాలన్నారు. అదేవిధంగా 10 వేల జనాభా కంటే తక్కువ ఉన్న పంచాయతీల్లో సర్పంచ్ అభ్యర్థికి రూ.1.5 లక్షలు, వార్డు సభ్యులకు రూ.30 వేలు మాత్రమే ఉండాలన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనలు తప్పక పాటించాలని, ఎటువంటి అవాంతరాలు లేకుండా ఎన్నికల విధులు నిర్వహించాలని అధికారులను డీపీవో ఆదేశించారు.

వాడీవేడిగా సర్వసభ్య సమావేశం



ఎంపీపీకి సమస్యలు చెబుతున్న చిన్న కంభం సర్పంచ్

కంభం: ప్రజాప్రతినిధులు తెలిపే సమస్యలను అధికారులు వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ చేగిరెడ్డి తులశమ్మ సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశం వాడీవేడిగా సాగింది. ప్రభుత్వ వైద్యశాలలో సాధారణ కాన్పులు చెయ్యకుండా ఎక్కువ మందిని ఇతర ఆస్పత్రులకు రిఫర్ చేస్తున్నారని కంభం సర్పంచ్ బోడయ్య అన్నారు. పేద ప్రజలే ఎక్కువగా ప్రభుత్వ వైద్యశాలలకు వస్తారని, అటువంటి వారికి నాణ్యమైన వైద్యం అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. స్థానిక వైజంక్షన్ నుంచి బస్టాండు వరకు నిర్మిస్తున్న డ్రైనేజీ కాలువలు ఇష్టానుసారం నిర్మిస్తున్నారని, అధికారులు కొలతలు వేయించి దాని ప్రకారం కాలువలు నిర్మించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. చిన్నకంభం జగనన్న కాలనీలో నిర్మించిన ట్యాంకులు నాసిరకంగా ఉండటంతో బోరునీళ్లు వృథాగా పోతున్నాయని చిన్నకంభం సర్పంచ్ రసూల్ తెలిపారు. 2019వ సంవత్సరంలో లబ్ధిదారులక ఇచ్చిన ఇంటి స్థలాల్లో కొంతమందికి నేటి వరకు హద్దులు చూపించలేదన్నారు. చిన్నకంభం, పోరుమామిళ్లపల్లి గ్రామ ఇలాఖాలో ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రెవెన్యూ కార్యాలయంలో కొందరు వీఆర్వోలు డబ్బులు ఇస్తేనే పని చేస్తున్నారని, చిన్న పనులకు సైతం నెలల తరబడి తిప్పుతూ ప్రజలను ఇబ్బంది పెడుతున్నార కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ సలీం తెలిపారు. ఇరిగేషన్ కాలువల్లో చెత్త, వ్యర్థాలు వేయకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎల్‌కోట పరిధిలో అసంపూర్తిగా నిలిచి ఉన్న అంగన్‌వాడీ భవనాన్ని పూర్తి చేయాలని సర్పంచ్ మహ్మద్ బాషా తెలిపారు. అన్ని శాఖల అధికారులు సర్వసభ్య సమావేశానికి హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని ప్రజాప్రతినిధులు ఎంపీడీఓను కోరారు. ఎంపీపీ మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు సభ దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను సంబంధిత అధికారుల పరిష్కరించాలని కోరారు. సమావేశంలో ఎంపీడీఓ సయ్యద్ మస్తాన్ వలి, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీటీసీలు ఆనంద్, రఫీ, నాగరాజు, రవీంద్ర, రామ్మూర్తి, హసీనా, ఖాసింబీ, సర్పంచులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

బీసీ కులాల జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా వెంకటయ్య

గిద్దలూరు రూరల్: బీసీ కులాల జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా గిద్దలూరుకు చెందిన ఓ.వెంకటయ్యను సోమవారం నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు మిరియం శ్రీనివాసులు తెలిపారు. ఈ సందర్భంగా బీసీ కులాల జేఏసీ అభ్యున్నతి కోసం వెంకటయ్య పాటుపడతానని, ఆయనతో మిరియం శ్రీనివాసులు ప్రతిజ్ఞ చేయించి నియామక పత్రం అందజేశారు.

గద్దర్‌కు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న ఎంపీటీసీ, గ్రామస్తులు

అల్లూరు (కొత్తపట్నం): ప్రజాగాయకుడు, ఉద్యమాల వీరుడు గద్దర్‌కు అల్లూరు బస్టాండ్ సెంటర్‌లోని వైఎస్సార్ విగ్రహం వద్ద సోమవారం ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీనియర్ కళాకారుడు, అల్లూరు ఎంపీటీసీ మిట్నసల శాంతారావు మాట్లాడుతూ ఎప్పుడూ ప్రజల్లో ఉంటూ ప్రజా సమస్యలపై పోరాటం చేసిన వ్యక్తి గద్దర్ అని కొనియాడారు. అనేక ఉద్యమాల్లో పాల్గొనడం, గొప్ప గొప్ప పాటలు పాడటం ద్వారా ఆయన మంచిపేరు తెచ్చుకున్నారని వివరించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని నిమిషం పాటు మౌనం పాటించారు. గద్దర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎం.చైతన్యప్రసాద్, సుబ్బారావు, నారాయణరెడ్డి, హరిబాబు, చిట్టిబాబు, జాలయ్య, ప్రసాద్, యేసేబు తదితరులు పాల్గొన్నారు.

అనుమలవీడులో డీఎస్పీ విచారణ



విచారిస్తున్న సీఐ దేవప్రభాకర్

రాచర్ల: మండలంలోని అనుమలవీడు గ్రామానికి చెందిన షేక్ షేక్షావలి నివాస గృహంలో ఏవరూ లేని సమయంలో అతని భార్య షేక్ అయేషాను ఆగంతకులు కత్తులు చూపించి బెదిరించిన ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు. సోమవారం సాక్షి దినపత్రికలో పట్టపగలే దోపిడీకి యత్నం..అనే శీర్షికతో ప్రచురించిన కథనానికి మార్కాపురం డీఎస్పీ జి.వీర రాఘవరెడ్డితో పాటు గిద్దలూరు సీఐ పి.దేవప్రభాకర్ స్పందించారు. అనుమలవీడు గ్రామానికి చెరుకుని షేక్షావలితో పాటు చుట్టు పక్కల నివాసం ఉంటున్న ప్రజలతో మాట్లాడి వివరాలు సేకరించారు. అనంతరం అయేషా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ జి.కృష్ణపావని తెలిపారు.

దాడి కేసు నమోదు

ముండ్లమూరు: మండలంలోని శంకరాపురం గ్రామానికి చెందిన మందలపు నర్సయ్యపై అదే గ్రామానికి చెందిన మందలపు వెంకటేశ్వర్లు, భార్య ఆదిలక్ష్మి, కుమార్తె విజయరాణి దాడి చేసి గాయపరిచారని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై కృష్ణయ్య తెలిపారు. రెండు రోజుల క్రితం నర్సయ్యకు, వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులకు దారి విషయంలో జరిగిన గొడవలో వెంకటేశ్వర్లు, అతని కుటుంబ సభ్యులు దాడి చేయగా తలకి గాయం కావడంతో నర్సయ్య అద్దంకి ప్రభుత్వ వైద్యశాలలో చేరారు. సోమవారం వైద్యశాల నుంచి వచ్చిన రిపోర్టు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఏఆర్ ఎస్‌ఐగా జ్యోతి ఎంపిక



కొమరోలు: తెలంగాణ రాష్ట్రంలో ఎస్‌ఐ ఫలితాల్లో మండలంలోని ద్వారకచర్ల గ్రామానికి చెందిన బొడ్డు జ్యోతి సత్తా చాటారు. ఇటీవల విడుదలైన తెలంగాణ ఏఆర్ ఎస్‌ఐ ఫలితాల్లో ఆమె కొలువు చేజిక్కించుకుంది. 2022 ఏప్రిల్లో విడుదల చేసిన ఎస్సై నోటిఫికేషన్‌కు దరఖాస్తు చేసుకున్న బొడ్డు జ్యోతి ప్రిలిమ్స్‌లో సెలక్ట్ అయి ఈ ఏడాది ఏప్రిల్ 8, 9 తేదీల్లో నిర్వహించిన పరీక్షల్లో ఎంపికై ఏఆర్ ఎస్‌ఐగా ఉద్యోగం పొందింది. తిరుపతిలోని ఓ ప్రైవేటు సైనిక్ పాఠశాలలో పీఈటీగా ఉద్యోగం చేస్తూనే ఎస్‌ఐ శిక్షణ పొందినట్లు జ్యోతి తెలిపింది. తన తల్లి లక్ష్మీదేవి ప్రోత్సాహంతో ఎస్‌ఐగా ఎంపికైనట్లుగా పేర్కొంది.

ఇద్దరి మధ్య ఘర్షణ

గిద్దలూరు రూరల్: పట్టణంలోని ఓ రెస్టారెంట్‌లో ఇద్దరి మధ్య జరిగిన ఘర్షణతో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. ఈ సంఘటన సోమవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. ఎగువరామాపురానికి చెందిన చిన్న కాశన్న, కె.ఎస్.పల్లెకు చెందిన అబ్దుల్ సలీంలకు రెస్టారెంట్‌లో మాటామాటా పెరిగి ఘర్షణ ఏర్పడింది. ఈ నేపథ్యంలో కాశన్నను అబ్దుల్ సలీమ్ తలపై గాయపరిచాడు. కాశన్నను చికిత్స కోసం గిద్దలూరు ఏరియా వైద్యశాలకు తరలించారు.

నేడు మంత్రి ఆదిమూలపు సురేష్ పర్యటన

యర్రగొండపాలెం: మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ మంగళవారం యర్రగొండపాలెంలో పర్యటించనున్నారని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కొప్పర్తి చిన్న ఓబులరెడ్డి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రాం ఆడిటోరియంలో ప్రకృతి వ్యవసాయం చేసే ఎస్సీ రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తారని పేర్కొన్నారు.

తల్లీపిల్లల పోషణపై కేంద్రం ప్రత్యేక శ్రద్ధ

ఒంగోలు: తల్లీపిల్లల పోషణపై కేంద్రం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని కేంద్ర మహిళా శిశు అభివృద్ధి శాఖామంత్రి స్మృతిఇరాని తెలిపారు. ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి పార్లమెంట్‌లో లేవనెత్తిన అంశానికి ఆమె వివరణ ఇచ్చారు. దేశంలోని 6 సంవత్సరాల పిల్లలు, కౌమార దశ బాలికలు, గర్భిణులు, పాలిచ్చే తల్లుల పోషకాహార సమస్యలు అధిగమించేందుకు, వారి పోషక స్థితిని అభివృద్ధిపరిచేందుకు 2018లో కేంద్రం పోషణ అభియాన్/జాతీయ పోషణ్ మిషన్‌ను ప్రారంభించిందన్నారు. సాంకేతిక పద్ధతులు, ప్రభుత్వ శాఖల సహకారం, నిర్వహణ సామర్థ్య నిర్మాణం, ప్రజల భాగస్వామ్యం ప్రధాన భాగాలుగా పోషకాహార లోపాన్ని అరికట్టే ప్రయత్నం చేస్తున్నట్లు చెప్పారు. అంగన్‌వాడీ సేవల కింద ఉన్న అనుబంధ పోషణ కార్యక్రమం, పోషణ అభయాన్, కౌమార దశ బాలికలు పథకాలను సాక్షామ్ అంగన్‌వాడీ అండ్ పోషన్ (మిషన్ పోషన్ 2.0)గా చేర్చడం జరిగిందన్నారు. ఆరోగ్యం, క్షేమం, రోగనిరోధక శక్తి పెంపుదలకు ఈ మిషన్ తోడ్పాటు ఇస్తుందన్నారు. ప్రభుత్వ మార్గనిర్దేశాల ప్రకారం ఈ పథకం అమలుకు సంబంధించిన అన్ని కార్యక్రమాలను రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, పోషణ కమిటీ జిల్లా అధికారులు, పోషణ కమిటీ పర్యవేక్షించడం జరుగుతుందన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఆధ్వర్యంలో సంబంధిత శాఖల జిల్లా అధికారులు నియమించిన ఉద్యోగులతో సరుకుల పంపిణీ, తదితర పనులు నిర్వహిస్తారన్నారు. 2020-21 నుంచి 2022-23 వరకు ఈ పథకం కింద కేంద్రం అన్ని రాష్ట్రాలకు రూ.686.67 కోట్లు విడుదల చేయడం జరిగిందని, ఆంధ్రప్రదేశ్‌కు రూ.35.97 కోట్లు విడుదల చేశామని అన్నారు. అన్ని రాష్ట్రాల్లో 13.9 లక్షల అంగన్‌వాడీ కేంద్రాల కింద రూ.10.33 కోట్ల లబ్ధిదారులు నమోదయ్యారని, సమర్థవంతంగా అమలు చేయడం వల్ల జూన్ 2023 నాటికి కేవలం తక్కువ బరువుతో 19 శాతం పిల్లలు, లోపభూయిష్టతతో 7 శాతం పిల్లలు మాత్రమే ఉన్నారని కేంద్ర మంత్రి వివరించారు.

అంగన్‌వాడీ సెంటర్లలో విజిలెన్స్ తనిఖీలు



దొడ్డవరంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఓ సంగమేశ్వరరెడ్డి

మద్దిపాడు: మండలంలోని దొడ్డవరం, కొలచనకోట ఎస్సీకాలనీల్లో గల అంగన్‌వాడీ కేంద్రాలను విజిలెన్స్ అధికారి సంగమేశ్వరరెడ్డి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పర్యవేక్షణ లోపం ఉన్నట్లు గుర్తించారు. దొడ్డవరం సెంటర్‌లో ఎన్‌రోల్‌మెంట్ రిజిస్టర్‌ను పరిశీలించగా 25 మంది ఉన్నారని, కానీ 12 మంది పిల్లలు మాత్రమే హాజరయ్యారని తెలిపారు. కొలచనకోటలో 15 మందిని రిజిస్టర్‌లో నమోదు చేయగా 8 మంది మాత్రమే హాజరయ్యారన్నారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలతో ఆయన మాట్లాడుతూ టేక్ హోమ్ రేషన్ సక్రమంగా ఇస్తున్నారా అని ప్రశ్నించారు. అనంతరం టేక్ హోమ్ రేషన్‌కు సంబంధించిన సరుకులను పరిశీలించి నాణ్యతగా ఉన్నట్లు గుర్తించారు. చిన్నారులకు వండిన భోజనాన్ని రుచి చూసి వారికి సక్రమంగా మెనూ అందించాలని ఆదేశించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రతి అంగన్‌వాడీ సెంటర్‌ను పరిశీలించనున్నట్లు తెలిపారు. రిపోర్టును ఉన్నతాధికారులకు పంపనున్నట్లు చెప్పారు. ఆయన వెంట విజిలెన్స్ సిబ్బంది, అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాలు పాల్గొన్నారు.

క్రమశిక్షణపై బాలికలకు అవగాహన అవసరం



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీన్ రూప్ ఆకాష్

ఒంగోలు: స్థానిక పేస్ ఇంజినీరింగ్ కాలేజీలో ఉమన్ ఎంపవర్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో క్రమశిక్షణపై బాలికలకు సోమవారం అవగాహన తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా డీన్ రూప్ ఆకాష్ మాట్లాడుతూ లక్ష్యం, సాఫల్యతకు క్రమశిక్షణ గొప్ప వారధి అని అన్నారు. బాలికలు తమ కెరియర్ గురించి ప్రథమ సంవత్సరం నుంచే లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకోవాలన్నారు. లక్ష్యాన్ని చేరుకోవడానికి క్రమశిక్షణ, పట్టుదలతో శ్రమించాలన్నారు. వీలైనంత తక్కువగా సామాజిక మాధ్యమాలను వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో డబ్ల్యూఈసీ కన్వీనర్ వైష్ణవి, కాలేజీ కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్, ప్రిన్సిపాల్ డాక్టర్ జీవీకే మూర్తి, అడ్మిషన్ డైరెక్టర్ డాక్టర్ ఆర్.వీరాంజనేయులు, ఏవో రమణబాబు తదితరులు పాల్గొన్నారు.

నగరపాలక సంస్థ స్పందనకు 12 అర్జీలు



అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్

ఒంగోలు టౌన్: స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 12 అర్జీలు అందాయి. పట్టణ ప్రణాళిక విభాగానికి సంబంధించి 5, శానిటేషన్ విభాగానికి 4, రెవెన్యూకు సంబంధించి 3 అర్జీలు రాగా, ఆయా విభాగాల అధికారులకు వాటిని పంపించారు. నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. కలెక్టర్ స్పందనలో పర్సువల్‌గా కమిషనర్ పాల్గొన్నారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ వైద్యశాఖ అధికారి మనోహర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పొదుపు గ్రూపుల డిపాజిట్లు గల్లంతు



విచారణ చేస్తున్న ఏపీజీబీ ఆర్ఎం శ్రీనివాస ప్రసాద్

యర్రగొండపాలెం: స్వయం సహాయక సంఘాలు బీసీ పాయింట్‌లో జరుపుతున్న లావాదేవిల్లో ఆ పాయింట్ నిర్వాహకుడు చేతివాటం చూపినట్లు వెల్లడయింది. త్రిపురాంతకంలోని ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు వ్యాపార ప్రతినిధి (బీసీ పాయింట్) గుంటక వెంకటరెడ్డి యర్రగొండపాలెం మండలంలోని సేవింగ్ డిపాజిట్లు, రుణాల లావాదేవీలకు సంబంధించిన డబ్బులను స్వాహా చేశాడు. ఈ మేరకు సోమవారం ఏపీజీబీ మార్కాపురం రీజనల్ మేనేజరు కె.శ్రీనివాసప్రసాద్, డీఆర్‌డీఏ నోడల్ అధికారి ఈ.మనోజ్, ఏరియా కో ఆర్డినేటర్ కె.లక్ష్మీరెడ్డి తమ సిబ్బందితో నరసాయపాలెం వెళ్లి దర్యాప్తు చేపట్టారు. నరసాయపాలెం, గంగపాలెం గ్రామాల్లో మొత్తం 56 స్వయం సహాయక సంఘాలు ఉండగా వాటిలో 21 సంఘాల లావాదేవీలను పరిశీలించి రూ.1,77,600లు బ్యాంకుకు జమ కాలేదని, మిగిలిన 35 సంఘాల లావాదేవీలను పరిశీలించాల్సి ఉందని ఏరియా కో ఆర్డినేటర్ తెలిపారు. స్వయం సహాయక సంఘాల అకౌంట్‌లను పరిశీలించిన వారిలో ఏపీఎం ఆర్.కృపమ్మ, లీగల్ కో ఆర్డినేటర్ ఎం.వెంకయ్య, సీసీ ఇబ్రహీం ఉన్నారు.

ఈకేవైసీ పెండింగ్‌లు పూర్తి చేయాలి

పుల్లలచెరువు: మండలంలోని సచివాలయాల పరిధిలో పీఎం కిసాన్ ఈకేవైసీ పెండింగ్ ఉన్న వారు ఈకేవైసీ చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి నిర్మలాదేవి తెలిపారు. ఈ మేరకు ఆమె సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పీఎం కిసాన్‌కు సంబంధించిన రైతులు ఎవరైనా ఈకేవైసీ చేయించుకోకుండా ఉంటే వెంటనే తమ సచివాలయం పరిధిలో చేయించుకోవాలని, రైతులు ఈ విషయం గమనించాలన్నారు. ఈకేవైసీ చేయించుకోకుంటే అనర్హులుగా ఉండిపోతారని హెచ్చరించారు.

క్లుప్తంగా

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఒంగోలు టౌన్: మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్థానిక కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాకు నాగయ్య అధ్యక్షత వహించగా, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు పాల్గొని ప్రసంగించారు. ధర్నా అనంతరం కలెక్టరేట్ ముట్టడికి ర్యాలీగా వెళ్తున్న కార్మికులను పోలీసులు అడ్డుకుని అరెస్టు చేయగా, వారిని విడుదల చేయాలని కోరుతూ చర్చి సెంటర్ వద్ద మానవహారం నిర్వహించారు. యూనియన్ జిల్లా కార్యదర్శి కొత్రిపాటి శ్రీనివాసరావు, సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

రూ.30 లక్షలతో సిమెంటు రోడ్లకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ

చీమకుర్తి: మండలంలోని ముప్వవారిపాలెం ఎస్సీకాలనీలో మండల పరిషత్ నిధులు రూ.30 లక్షలతో నిర్మించనున్న సిమెంట్ రోడ్డు, సైడు కాలువలకు ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యుడు వేమా శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పమిడి వెంకటేశ్వర్లు సోమవారం శంకుస్థాపన చేశారు. మండల పరిషత్ నిధులతో పలు గ్రామాల్లో అభివృద్ధి పనులు చేస్తున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో బొడ్డు కోటేశ్వరరావు, కుంచాల రాంబాబు, చింతపట్ల బ్రహ్మయ్య, స్థానికులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఉత్తమ జోన్ చైర్మన్‌గా న్యామతుల్లాబాషా



అవార్డు అందుకుంటున్న న్యామతుల్లాబాషా

ఒంగోలు: లయన్స్ క్లబ్ ఉత్తమ జోన్ చైర్మన్‌గా బ్రిలియంట్ కంప్యూటర్స్ అధినేత న్యామతుల్లా బాషా ఎంపికై అవార్డు అందుకున్నారు. గుంటూరులో లయన్స్ డిస్ట్రిక్ట్ గవర్నర్ కృపానందం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో హైకోర్టు జడ్జి కె.మన్మథరావు చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. అదే వేదికపై 2023-24 సంవత్సరానికి లయన్స్ ఇంటర్నేషనల్ రీజినల్ చైర్మన్‌గా న్యామతుల్లాబాషాను నియమిస్తూ కృపానందం ప్రకటించారు. ఆయనను లయన్స్ సభ్యులు, ప్రతినిధులు అభినందించారు.

19న కొండాయపాలెం వార్డు సభ్యుని ఎన్నిక

పొదిలి రూరల్: మండలంలోని కొండాయపాలెం 3వ వార్డుకు ఈ నెల 19న ఉప ఎన్నిక నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పి.శ్రీకృష్ణ పేర్కొన్నారు. అనివార్య కారణాల వల్ల ఖాళీ అయిన లేక మృతి చెందిన సభ్యుల స్థానాలకు ఎన్నిల కమిషన్ ఆదివారం నోటిఫికేషన్ విడుదల చేసినట్లు తెలిపారు. కొండాయపాలెం 3వ వార్డు మెంబర్ జొన్నలగడ్డ నాగలక్ష్మి ఉరివేసుకుని మృతి చెందారు. ఈ స్థానానికి మంగళవారం నుంచి 10వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరిస్తామని, 11న స్క్రూటినీ, 14న నామినేషన్ల విత్ డ్రా, 19న ఓటింగ్, అదే రోజు మధ్యాహ్నం నుంచి కౌంటింగ్ నిర్వహిస్తామని వివరించారు.

అనుమానాస్పద వ్యక్తులపై బైండోవర్ కేసులు

దర్శి: పట్టణంలో అర్ధరాత్రి అనుమానాస్పదంగా తిరుగుతున్న అద్దంకికి చెందిన లక్కా బ్రహ్మయ్య, మేదరమెట్ల సమీపంలోని బొడ్డువారిపాలేనికి చెందిన గండి మరియదాసుపై పోలీసులు అనుమానాస్పద కేసు నమోదు చేశారు. దొంగతనాలు జరగకుండా రాత్రి పూట పోలీస్ గస్తీ నిర్వహిస్తున్న నేపథ్యంలో దొంగలు, అనుమానాస్పద వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు ఏఎస్‌ఐ శ్రీనివాసరెడ్డి తెలిపారు. అందులో భాగంగా ఇద్దరు అనుమానితులపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు చెప్పారు.

ఎల్ఐసీ ఏజెంట్ల ప్రెసిడెంట్‌గా నర్సిరెడ్డి

గిద్దలూరు రూరల్: పట్టణంలోని ముత్తుముల కల్యాణ మండపం ఆవరణలో సోమవారం నిర్వహించిన ఎల్ఐసీ ఏజెంట్ల నూతన కార్యవర్గ ఎన్నికల్లో పి.నర్సిరెడ్డిని ప్రెసిడెంట్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వైస్ ప్రెసిడెంట్‌గా కె.సత్యనారాయణ, సెక్రటరీగా బి.రామకృష్ణయ్య, జాయింట్ సెక్రటరీగా బాలచెన్నయ్యలను ఎన్నుకున్నారు.

కేజీబీవీలో కంటి వైద్యశిబిరం

రాచర్ల: స్థానిక కస్తూరిబా బాలికల పాఠశాలలో అనుమలవీడు ప్రాథమిక ఆర్యోగ కేంద్రం ఆధ్వర్యంలో డాక్టర్ సుదర్శన్‌రెడ్డి సోమవారం కండ్లకలక వ్యాధిపై వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు కండ్లకలక వ్యాధికి సంబంధించిన పరీక్షలు నిర్వహించి మందులతో పాటు కండ్లల్లో వేసుకునే చుక్కల మందు పంపిణీ చేశారు. అనుమలవీడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సూపర్‌వైజార్ ముత్యాల ప్రసాద్, ప్రిన్సిపాల్ మాలకొండమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.